సాక్షి నిజామాబాద్


గురువారం, 3, ఆగస్టు, 2023



తహసీల్దార్లకు పోస్టింగులు

జిల్లాలో 23 మంది తహసీల్దార్లకు పోస్టింగులు ఇస్తూ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఉత్తర్వులు జారీ చేశారు.

- 8లో ▸



రైల్వేస్టేషన్‌కు మహర్దశ

అమృత్ భారత్ పథకంలో భాగంగా నిజామాబాద్ రైల్వేస్టేషన్ అభివృద్ధి కోసం కేంద్రం నిధులు మంజూరు చేసింది.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
31.8 /24.9

వాతావరణం

ఉదయం ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం మేఘావృతమై చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. సాయంత్రం మోస్తరు వర్షం కురియవచ్చు.

న్యూస్‌రీల్

ఎస్సై అభ్యర్థులకు మెయిల్స్

ఖలీల్‌వాడి : జిల్లాలోని ఎస్సై అభ్యర్థులు ఫలితాల కోసం ఎదురుచూస్తున్నారు. ఎస్సై ఫలితాలు వెల్లడించక ముందే జిల్లాలో ఎస్సై మెయిన్స్ పరీక్షలో అత్యధిక మార్కులు సాధించిన అభ్యర్థులకు టీఎస్ఎల్‌పీఆర్‌బీ (తెలంగాణ స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు) ఈమెయిల్స్ ద్వారా అభ్యర్థులకు సమాచారం అడుగుతోంది. ఇప్పటికే ఇతర ఉద్యోగాల్లో ఉన్నవారు ఎస్సై ఉద్యోగం అవసరం లేకపోతే ఈనెల 4వ తేదీ లోపు సమాచారం ఇవ్వాలని ఆ మెయిల్స్‌లో పేర్కొంది. జిల్లాకు చెందిన అభ్యర్థులు బాసర జోన్ పరిధిలోకి వస్తారు. దీంతో ఈ జోన్ పరిధిలోని అభ్యర్థులకు మంగళవారం, బుధవారాల్లో మెయిల్స్ వచ్చినట్లు సమాచారం. ఎస్సై అభ్యర్థులు విల్లింగ్ ఇవ్వకుంటే వేరే అభ్యర్థులకు అవకాశాలు కల్పిస్తారని తెలుస్తోంది. గతంలో లాగా బ్యాక్‌లాగ్ పోస్టులు లేకుండా చేయాలని బోర్డు కొత్తగా ఈసారి మెయిల్స్ పంపించినట్లు చర్చ జరుగుతుంది.

పీజీ పరీక్షల్లో 50 మంది గైర్హాజరు

తెయూ(డిచ్‌పల్లి) : తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న పీజీ సెమిస్టర్ పరీక్షల్లో బుధవారం 50 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం అరుణ తెలిపారు. ఉదయం జరిగిన ఎంబీఏ, ఎంసీఏ 2వ సెమిస్టర్, ఐఎంబీఏ, అప్లయిడ్ ఎకనామిక్స్, ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ 8వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలలో 670 మంది విద్యార్థులకు 624 మంది విద్యార్థులు హాజరు కాగా 46 మంది గైర్హాజరైనట్లు కంట్రోలర్ తెలిపారు. అలాగే మధ్యాహ్నం జరిగిన ఎల్ఎల్‌బీ 4వ సెమిస్టర్ పరీక్షలో 36 మంది విద్యార్థులకు గానూ 32 మంది హాజరయ్యారని ఆమె తెలిపారు.

ఈ నెల 14 నుంచి పీజీ సెమిస్టర్ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి) : తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని పీజీ 2వ, 4వ, 6వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలు ఈ నెల 14 నుంచి 28వరకు జరుగుతాయని కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం అరుణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ 2వ, 4వ సెమిస్టర్, బీఎల్ఐఎస్సీ 2వ సెమిస్టర్, ఇంటిగ్రేటెడ్ ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ 4వ, 6వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ థియరీ పరీక్షలు జరుగుతాయన్నారు. తెయూ వెబ్‌సైట్ www.telanganauniversity.ac.inను సంప్రదించాలని ఆమె సూచించారు.

సహకార శాఖలో ముగ్గురికి పదోన్నతి

డొంకేశ్వర్(ఆర్మూర్) : జిల్లా సహకార శాఖలో సీనియర్ ఇన్‌స్పెక్టర్ హోదాలో ఉన్న ముగ్గురు ఉద్యోగులకు అసిస్టెంట్ రిజిస్టర్‌గా పదోన్నతులు లభించాయి. ఎస్ స్వరూపకు జిల్లాలోనే పోస్టింగ్ ఇవ్వగా, ఎ అంబర్‌సింగ్‌కు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, వి విజయలక్ష్మికి కామారెడ్డి జిల్లాకు పోస్టింగ్ ఇచ్చారు.

అంకితభావంతో పని చేయాలి



పెర్కిట్(ఆర్మూర్) : ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేసినప్పుడే విద్యార్థుల నుంచి ఆశించిన ఫలితాలు వస్తాయని డీఈవో దుర్గా ప్రసాద్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో తెలుగు, ఆంగ్లం, గణితం సబ్జెక్టు ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న ఫండమెంటల్ లిటరసీ అండ్ న్యూమరసీ శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం డీఈవో పరిశీలించారు. ఎంఈవో రాజ గంగారాం, నోడల్ ఆఫీసర్ వెంకట్ నర్సయ్య, రీసోర్స్ పర్సన్స్ పద్మావతి, పోశెట్టి, లింగన్న, సాయి రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

హోంగార్డులను రెగ్యులరైజ్ చేయాలి



ఖలీల్‌వాడి: ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని పలువురు హోం గార్డులు తమ కుటుంబసభ్యులతో కలిసి బుధవారం ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గతంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన మేరకు హోంగార్డులను రెగ్యులర్ చేయాలని వారు గుర్తు చేశారు. కార్యక్రమంలో హోం గార్డులు మోహన్‌రెడ్డి, రవి, భూమయ్య, ఫాయాజ్, పాల్గొన్నారు.



మాయాజాలం

- పసుపు రైతులకు దక్కని గిట్టుబాటు ధర.. ఉత్తరాది వ్యాపారుల గేమ్
- నిజామాబాద్ మార్కెట్‌కు 7.49 లక్షల క్వింటాళ్ల రాక
- రైతులకు క్వింటాలుకు వచ్చిన సగటు ధర రూ.5వేల నుంచి రూ.6 వేలు
- జూలై 31కి క్వింటాలుకు రూ.15,150 కు చేరుకున్న రేటు
- ఫ్యూచర్ ట్రేడింగ్‌లో డిసెంబర్ వరకు క్వింటా రూ.17,990 చూపిస్తున్న వైనం

ఉత్తర భారతానికి చెందిన బడా వ్యాపారుల మాయాజాలంతో పసుపు రైతులు దగా పడుతున్నారు. రైతు దగ్గర పంట ఉన్నంత సేపు క్వింటాకు ధర రూ. 6 వేలు మించలేదు. రైతులు పూర్తిగా అమ్ముకున్నాక ఒక్కసారిగా మూడింతలు రేటు పెరిగింది.

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : సుగంధ ద్రవ్యాల్లో కీలకమైన పసుపు ధరలో ఉత్తర భారతానికి చెందిన కొందరు బడా వ్యాపారులు ఆడుతున్న మార్కెట్ గేమ్ ఖంగుతినేలా చేస్తోంది. గత మే 31న సీజన్ పూర్తయ్యేలోగా రైతులకు సగటున క్వింటాలుకు రూ.5వేల నుంచి రూ.6వేలు మాత్రమే ధర లభించింది. 95 శాతం మంది రైతులు పూర్తి పంటను అమ్మేశారు. అయితే ఆ తరువాత జూన్ 1వ తేదీకి క్వింటా ధర రూ.7,742, 14వ తేదీకి క్వింటా రూ.8,132, జూలై 3వ తేదీకి రూ.10,006, జూలై 31వ తేదీకి క్వింటా ధర అమాంతం రూ.15,150 కు ఎగబాకింది. ఇక్కడే అసలైన అర్థం ఉంది. మే 31వ తేదీలోగా రైతులు పసుపును దాదాపుగా అమ్ముకోగా, జూలై రెండోవారంలోగా స్థానిక ట్రేడర్లు సైతం ఉత్తరాదిలోని కోల్‌కతా, అహ్మదాబాద్, ముంబై కి చెందిన బడా వ్యాపారులకు అమ్ముకున్నారు. ఆ మరుక్షణమే ధర ఉరకలెత్తడం మొదలైంది. జూలై 31కి రూ.15,150కు చేరుకుంది. 'స్టాక్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా' రెగ్యులేటరీలో పనిచేసే (ఎన్సీడీఈఎక్స్) 'నేషనల్ కమోడిటీ అండ్ డెరివేటివ్స్ ఎక్స్ఛేంజ్'లో వచ్చే డిసెంబర్‌కు పసుపు ధర క్వింటాలుకు రూ.17,990 చూపిస్తోంది. 'ఎన్సీడీఈఎక్స్' ఆధారంగానే దేశంలో సుగంధ ద్రవ్యాల ఉత్పత్తుల ధరలు మారుతుంటాయి. రైతుల వద్ద నుంచి ట్రేడర్లు కొనుగోలు చేశాక కొంతమేరకు ధర పెరిగినప్పటికీ, ట్రేడర్ల వద్ద నుంచి బడా వ్యాపారులు కొనుగోలు చేశాక మాత్రం అమాంతం ధర పెంచుతుండడం గమనార్హం.

ఇందూరుకే అత్యధిక పంట..

తెలంగాణ వ్యాప్తంగా గత సీజన్‌లో సుమారు 8.80 లక్షల క్వింటాళ్ల పసుపు దిగుబడి వచ్చింది. ఇందులో అత్యధికంగా నిజామాబాద్ మార్కెట్‌కు 7.49 లక్షల క్వింటాళ్లు వచ్చింది. మిగిలిన పసుపు వరంగల్, కేసముద్రం, వికారాబాద్ మార్కెట్లకు వచ్చింది. 5 శాతం పసుపు మాత్రం మహారాష్ట్రకు వెళ్లింది. పసుపు పంట విస్తీర్ణం భారీగా తగ్గుతున్నప్పటికీ రైతులకు మాత్రం ఆశించిన మేర ధర లభించడం లేదు. తెలంగాణ వ్యాప్తంగా 2021 సీజన్‌లో 85,916 ఎకరాల్లో పసుపు సాగు చేయగా, 2022 సీజన్‌లో కేవలం 56,073 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. అయినప్పటికీ రైతు వద్ద పంట ఉన్నంతసేపు ధర దక్కకపోగా, రైతు అమ్ముకున్న వెంటనే పెంచేలా 'ఎన్సీడీఈఎక్స్' ద్వారా బడా వ్యాపారులు గేమ్ ఆడుతుండడం విశేషం.

ఎందుకంటే సాధా రణ స్టాక్ మార్కెట్‌లో షేర్ల విషయానికి సంబంధించి 'స్పెక్యులేషన్' ఉంటుంది. కానీ 'ఎన్సీడీఈఎక్స్' లో మాత్రం కొందరు వ్యాపారులే చక్రం తిప్పుతూ మాయాజాలం చేస్తుండడం గమనార్హం. ఇటీవల మరో రైతు ఉత్పత్తి 'జిలకర' విషయంలోనూ బడా వ్యాపారులు ఇలాగే మాయాజాలంతో కూడిన గేమ్ ఆడడం పరిస్థితికి అద్దం పడుతోంది. గత జనవరి లో జిలకర క్వింటా రూ.33,090 ఉండగా, మే1వ తేదీకి క్వింటా రూ.45,000కు పెంచారు. ఫ్యూచర్ ట్రేడింగ్ ఇండెక్స్ ప్రకారం వచ్చే ఆగస్టు 18వ తేదీకి క్వింటా రూ.59,430కు, సెప్టెంబర్ 20వ తేదీకి జిలకర క్వింటా రూ.60,010 చూపిస్తుండడం విశేషం.

'కిక్కు' ఎవరికో..!

- జిల్లాలో 102 వైన్ షాపులు
- నవంబర్‌లో ముగియనున్న పాత లైసెన్స్‌లు
- కొత్త లైసెన్స్‌ల కోసం ముందుగానే టెండర్లకు ఆహ్వానం
- ఎన్నికల కోడ్ నేపథ్యంలో 4 నుంచి దరఖాస్తుల స్వీకరణ
- ఈనెల 18న ముగింపు.. 21న డ్రా



ఖలీల్‌వాడి : వైన్ దుకాణాలకు టెండర్లు నవంబర్‌లో జరగాల్సి ఉండగా ముందస్తుగా నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ప్రస్తుతం ఉన్న వైన్స్‌లకు మరో రెండునెలల పాటు లైసెన్స్‌లు ఉండగానే ముందుస్తుగా టెండర్లు వేసేందుకు ప్రణాళికలు వేస్తోంది. అక్టోబర్‌లో ఎన్నికల కోడ్ వచ్చే అవకాశాలుండడంతో ఆ సమయంలో లాటరీల నిర్వహణకు ఇబ్బందులు ఏర్పడుతాయని ఎక్సైజ్ శాఖ ఉన్నతస్థాయి అధికారులు జిల్లాలోని డిప్యూటీ ఎక్సైజ్ కమిషనర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్లతో ముందుగా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 2021-2023 పిరియడ్ ముగియకముందే 2023-2025 సంబంధించి వైన్స్ దుకాణాలకు లైసెన్స్‌లు ఇచ్చేందుకు జీవో నం. 86ను ఎక్సైజ్ శాఖ జారీ చేసింది. దీంతో ఈనెల 4వ తేదీ నుంచి ఎక్సైజ్ కార్యాలయంలో దరఖాస్తులు అందించనున్నారు.

టెండర్లు ఇలా..

ఎక్సైజ్ శాఖ కొత్త ఎక్సైజ్ పాలసీ ప్రకారం దరఖాస్తులు స్వీకరిస్తుందని డిప్యూటీ ఎక్సైజ్ కమిషనర్ దశరథం పేర్కొన్నారు. ఈనెల 3న జిల్లా కలెక్టర్ సమక్షంలో ఎస్సీ, ఎస్టీ, గౌడ, ఓపెన్ అభ్యర్థులకు వైన్ షాప్‌లు కేటాయిస్తారు. ఈనెల 3న వైన్ దుకాణాలకు నోటి ఫికేషన్ విడుదల చేస్తారని, 4న జిల్లా ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో దరఖాస్తులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ దరఖాస్తులు నింపి రూ. 2 లక్షలు డీడీ చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈనెల 18న సాయంత్రం 6 గంటలకు దరఖాస్తులను తీసుకుంటామని, 21న వైన్స్ లైసెన్స్‌లకు సంబంధించిన డ్రా తీస్తామన్నారు. వైన్స్ లైసెన్స్‌లు లాటరీలో వచ్చిన వారు అదే రోజు గాని మరుసటి రోజు (21, 22 తేదీల్లో) మొదటి ఇన్‌స్టాల్ మెంట్ చెల్లించాలని, వైన్స్‌లకు మద్యంను ఈనెల 30న అందిస్తామని, డిసెంబర్ 1 నుంచి షాపులను లైసెన్స్ పొందినవారు నడిపించుకోవాలన్నారు.

దరఖాస్తుల ద్వారా రూ. 35.24 కోట్ల ఆదాయం

జిల్లాలో 102 వైన్స్‌షాపులు ఉండగా వీటిని దక్కించుకోవడానికి 2021 నవంబర్‌లో 1,762 మంది దరఖాస్తులు చేసుకున్నారు. 1,762 దరఖాస్తుదారులకు సంబంధించి రూ. 35.24 కోట్లు ఆదాయం చేకూరింది. ఒక్కో దరఖాస్తుదారుడు ప్రస్తుతం లాటరీలో పాల్గొనేందుకు రూ.2 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ డబ్బులు తిరిగి ఇవ్వరు. ఈ ఏడాది ఎన్నికల సీజన్ కావడంతో జిల్లాలో వైన్స్‌లకు టెండర్లు సంఖ్య పెరిగి, రూ. 42 కోట్ల నుంచి 45 కోట్ల ఆదాయం వస్తుందని ఎక్సైజ్ అధికారులు అంచనా వేస్తున్నారు.

వైన్స్ దుకాణాల కేటాయింపులు

ఎస్సీలకు	11
ఎస్టీలకు	2
గౌడ్‌లు	11
ఓపెన్	78
మొత్తం	102

నవంబర్‌లో పాత లైసెన్స్‌లు క్లోజ్..

2021-2023కు గాను వైన్ దుకాణాల లైసెన్స్‌లు నవంబర్‌లో పూర్తవుతాయి. అసలైతే నవంబర్‌లోనే వైన్స్‌లకు దరఖాస్తులు ఆహ్వానించి మూడో వారంలో లాటరీ తీసేవారు. ఈ లాటరీలో వచ్చిన వారికి ఎక్కడ వచ్చిందో అక్కడ డిసెంబర్ 1 నుంచి వైన్స్‌లలో మద్యం అమ్మకాలు సాగించాల్సి ఉండేది. కాని ఈసారి ఎన్నికల కోడ్ వచ్చే అవకాశం ఉండడంతో ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చుకునేందుకు ముందుగానే టెండర్ ప్రక్రియ పూర్తి చేస్తున్నట్లు సమాచారం.

'ఎమ్మెల్యే మా ఊరికి రావొద్దు'

- బాజిరెడ్డికి వ్యతిరేకంగా మంచిప్పలో వెలిసిన ఫ్లెక్సీలు
- తొలగించిన పోలీసులు



మంచిప్పలో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ

మోపాల్(నిజామాబాద్‌రూరల్) : మండలంలోని మంచిప్ప గ్రామంలో సాలు..బాపు..సెలవు..బాపు గ్రామానికి రావొద్దు అంటూ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కు వ్యతిరేకంగా బుధవారం ఫ్లెక్సీలు వెలిశాయి. దీంతో గ్రామంలో ఒక్కసారిగా కలకలం రేగింది. ముంపు గ్రామాలు, తండాల పేరుతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో తీవ్ర చర్చనీయాంశమైంది. గ్రామానికి ఇచ్చిన హామీలతోపాటు మంచిప్ప ప్రాజెక్ట్ రీ డిజైన్ రద్దు.. అసెంబ్లీ ఎన్నికలు బహిష్కరిస్తామని, 200 మంది నామినేషన్లు వేస్తామంటూ పలు హెచ్చరికలతో కూడిన ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. గ్రామంలోని పలు ప్రధాన కూడళ్లల్లో 4 ఫ్లెక్సీలు వెలిసిన విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే తొలగించారు.అంతకుముందు బీఆర్ఎస్ నాయకులు ఫ్లెక్సీలు తొలగించేందుకు ప్రయత్నించగా, ఇరువర్గాల మధ్య వాగ్వాదంనెలకొందని తెలిసింది.

పలువురిపై కేసు నమోదు..

మంచిప్ప గ్రామంలో ఎమ్మెల్యేను రావొద్దని ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన సంఘటనలో పలువురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై ఎల్ రాము తెలిపారు. ఫ్లెక్సీలు తొలగిస్తే చంపేస్తామని కొందరు బెదిరించారని స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. ఆ ఫిర్యాదు మేరకు ఆరుగురితోపాటు మరికొందరిని గుర్తిస్తున్నామన్నారు.

జోరు తగ్గిన 'ఉపాధి'

- మందగించిన ఈజీఎస్ పనులు
- రోజుకు రూ. 4 వేలు కూడా దాటని కూలీల హాజరు
- వ్యవసాయ పనులకు వెళ్లడమే కారణం



చిన్నయానం వద్ద పనిచేస్తున్న ఉపాధి కూలీలు

డొంకేశ్వర్(ఆర్మూర్) : వేసవిలో ఊపందుకున్న ఉపాధిహామీ పనులు వర్షాకాలానికి వచ్చేసరికి నెమ్మదించాయి. మే నెలలో రోజుకు 50వేల నుంచి 60వేల మధ్యలో కూలీలు హాజరు కాగా, ప్రస్తుతం రోజుకు నాలుగు వేలు కూడా దాటని పరిస్థితి నెలకొంది. చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టే పరిస్థితి లేకపోవడంతో పాటు వ్యవసాయ పనులు మొదలయ్యాయి. తద్వారా ఎక్కువ కూలీ అప్పటికప్పుడు రావడంతో కూలీలంతా వ్యవసాయ పనుల కు వెళ్తున్నారు. దీంతో అన్ని మండలాల్లో కూలీల హాజరు శాతం గణనీయంగా పడిపోయింది. పలు మండలాల్లో 10-20 మంది మాత్రమే పనులకు వస్తుండడం గమనార్హం. జిల్లాలో 27 మండలాల పరిధిలోని 530 జీపీల్లో ఉపాధిహామీ పనులు జరుగుతున్నాయి. జాబ్ కార్డులు మొత్తం 2.56లక్షలు ఉండగా, ఇందులో 4.90లక్షల మంది సభ్యులున్నారు. యాక్టీవ్ కూలీల సంఖ్య 2.70 లక్ష లు ఉంది. వీరిలో పదిశాతం మంది కూడా ప నులకు రావడం లేదు. వాస్తవానికి మొన్న వేసవిలో రోజుకు లక్షమంది కూలీలు హాజరు కావాల్సి ఉండగా, 60వేల మందికి మించలేదు. ప్రతీ ఏటా కూలీల హజరు శాతం తగ్గుతూ వస్తోంది. చేసిన పనికి సక్రమంగా డబ్బులు రాకపోవడం కూడా మరొక ప్రధాన కారణమని చెప్పవచ్చు. వర్షాకాలం రావడంతో చెరువుల్లో నీళ్లు నిండాయి. దీంతో గుంతలు తీసే పనికి ఫుల్‌స్టాప్ పడింది. ప్రస్తుతం హరితహారంలో మొక్కలు నాటే పని ఒక్కటి మాత్రమే ఉంది.

బుధవారం హాజరైన కూలీలు

మండలం	హాజరైన కూలీలు	మండలం	హాజరైన కూలీలు
మోర్తాడ్	246	ఏర్గట్ల	63
జక్రాన్‌పల్లి	334	ఇందల్వాయి	170
బోధన్	466	భీమ్‌గల్	174
మోపాల్	228	డిచ్‌పల్లి	162
వర్ని	141	నిజామాబాద్	95
కమ్మర్‌పల్లి	136	నవీపేట్	152
బాల్కొండ	96	రెంజల్	101
వేల్పూర్	155	మెండోరా	52
ఎడపల్లి	146	ముప్కాల్	38
రుద్రూర్	81	ధర్పల్లి	83
నందిపేట్	322	సిరికొండ	71
ఆర్మూర్	217	కోటగిరి	65
మాక్లూర్	168	మోస్రా	10
		చందూర్	10

ఆర్టీసీ ఉద్యోగులకు సీఎం కానుక

- 43 వేల కుటుంబాల్లో వెలుగులు
- ముఖ్యమంత్రికి రుణపడి ఉండాలి
- అసెంబ్లీ సెషన్‌లో బిల్లు ఆమోదానికి కృషి
- ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్
- సంస్థ ఉద్యోగులు ప్రభుత్వంలో విలీనంపై సంబురాలు



ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డిని సన్మానిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

మోపాల్(నిజామాబాద్‌రూరల్) : సీఎం కేసీఆర్ ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులకు జీవితంలో మర్చిపోలేని పెద్ద కానుకను అందించారని, ఆయన ఏ నిర్ణయం తీసుకున్నా రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసమేనని ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గో వర్ధన్ పేర్కొన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ నిజామాబాద్ ఉమ్మడి జిల్లా ఆర్టీసీ రీజియన్ ఆధ్వర్యంలో రూరల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కార్మికులు, ఉద్యోగుల సంబురాలు అంబరాన్నంటాయి. ఉద్యోగులు పటాకులు కాల్చి స్వీట్లు పంచుకున్నారు. బాజిరెడ్డి గోవర్ధన్‌ను గజమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి మాట్లాడుతూ 43 వేల ఆర్టీసీ కుటుంబాల్లో వెలుగులు నింపిన ఆయనకు మనమంతా రుణపడి ఉండాలన్నారు. సిబ్బంది రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలని,ప్రభుత్వంలో విలీనమయ్యామని బాధ్య తారహితంగా వ్యవహరించవద్దన్నారు. ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న ఏడునెలల డీఏలు చెల్లించామని, సీఎం ప్రతిఏటా ఆర్టీసీకి రూ. 1500 కోట్లు కే టాయించి ప్రభుత్వ తోడ్పాటునందించారన్నారు. రూ.వెయ్యి కోట్ల నిధి గ్యారెంటీని కల్పిస్తే పీఎఫ్ చెల్లించి వారికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ దక్కేలా చూడాలని, పీఆర్సీ చెల్లించాలని సీఎం కేసీఆర్‌ను కోరానని, ఆయన ఏకంగా ప్రభుత్వంలో విలీనం చేయా లని నిర్ణయం తీసుకున్నారన్నారు. ఈ అసెంబ్లీ సెషన్‌లోనే బిల్లు ఆమోదింపజేస్తామన్నారు. ఉద్యోగులు, తాను ఎంతో కష్టపడి రూ. 2,500 కోట్ల నష్టాల్లో ఉన్న ఆర్టీసీని, రూ. 600 కోట్లకు తగ్గించామన్నారు. జిల్లాకేంద్రంలో 35 ప్లాట్‌ఫారాలతో కొత్త బస్టాండ్ నిర్మించడం తన కోరిక అని, సీఎం కేసీఆర్ మంజూరు చే స్తారని నమ్మకముందన్నారు. భీంగల్ డిపో పనులు కూడా ప్రారంభమయ్యాయన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేషన్లను అమ్ముకుంటూ ఉద్యోగులను నడిబజార్లలో పడేస్తుందని, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని కోరిన వారే ఇప్పుడు ప్రతిపక్షంలో ఉండి ఆస్తులమ్ముకోవడానికే నిర్ణయం తీసుకున్నారని విమర్శించడం సరికాదన్నారు.



మాట్లాడుతున్న బాజిరెడ్డి గోవర్ధన్

చరిత్రాత్మక నిర్ణయం : ఆర్ఎం జానీరెడ్డి

టీఎస్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం చరిత్రాత్మక నిర్ణయమని ఆర్ఎం జానీరెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంలు సరస్వతి, శంకర్, ఉమ్మడి జిల్లా డిపో మేనేజర్లు ఆనంద్, వెంకటేష్, శ్రీనివాస్, సదాశివ్, శ్రీనివాస్, మల్లేష్, పీవో పద్మజ, అంజన్న, నరేష్ చందర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాగొంతుక వినిపిస్తారా..!

- నేటి నుంచి వర్షాకాల సీజన్ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం
- జిల్లాలో అందరూ అధికార పక్షం నేతలే..
- సభ దృష్టికి సమస్యలను తీసుకెళ్తారనే ఆశలో జిల్లావాసులు



మోర్తాడ్(బాల్కొండ) : వర్షాకాల సీజన్ అసెంబ్లీ సమావేశాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ ఏడాది ఆఖరులో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించనుండటంతో ప్రస్తుత ప్రభుత్వానికి ఇవే చివరి సమావేశాలు అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అసెంబ్లీలోను, శాసనమండలిలోను జిల్లాకు చెందిన సభ్యులు అధికార పక్షానికి చెందినవారు కావడం గమనార్హం. శాసనసభ వేదికగా ప్రజల గొంతుకను ప్రజాప్రతినిధులు వినిపిస్తారా లేదా అనే చర్చ జరుగుతుంది. తాజాగా పంచాయతీ కార్మికులు విధులను బహిష్కరించి సమ్మె కొనసాగిస్తున్నారు. కారోబార్లు, పారిశుధ్య కార్మికులు, ఇతర సిబ్బంది నెల రోజుల నుంచి సమ్మె చేస్తున్నా ప్రభుత్వం వారిపట్ల సానుకూలంగా స్పందించడం లేదు. ఫలితంగా సమ్మె కొనసాగుతూ గ్రామాల్లో సమస్యలు వెంటాడుతున్నాయి. వీఆర్ఏలకు పేస్కేల్‌ను వర్తింపచేసిన ప్రభుత్వం వారిని వివిధ శాఖల్లో విలీనం చేయడానికి అడుగులు వేస్తోంది. మొదట్లో సెర్ప్ ఉద్యోగులకు పేస్కేల్‌ను అమలు చేశారు. ఆ సమయంలోనే తమకు కూడా పేస్కేల్‌ను అమలు చేయాలని ఉపాధి హామీ ఉద్యోగులు కోరుతున్నా రు. అసెంబ్లీ సమావేశాలను దృష్టిలో ఉంచుకుని తమ వేదనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. అసెంబ్లీలో చర్చ జరిగి తమ డిమాండ్ల పరిష్కారానికి మార్గం ఏర్పడుతుందని ఉపాధి ఉద్యోగులు ఆశిస్తున్నారు.

గల్ఫ్ కార్మికుల సంక్షేమంపై నిర్లక్ష్యం

తెలంగాణ నుంచి గల్ఫ్ దేశాలకు వలసలు ఎక్కువగా కొనసాగుతున్నాయి. అనేకమంది ఆయా దేశాల్లో మానసిక క్షోభతో అనారోగ్యంపాలై మృత్యువాత పడ్డారు. కొంత మంది ఆత్మహత్మలకు పాల్పడ్డారు. కొందరు ఉద్యోగాలు కోల్పోయి ఇంటిబాట పట్టి ఎలాంటి ఉపాధి లేకుండా ఇబ్బంది పడుతున్నారు. గల్ఫ్ వలస కార్మికుల సంక్షేమం ఎజెండాగా అసెంబ్లీలో చర్చ నిర్వహించి వలస కార్మికుల కోసం ఏదైనా కార్యాచరణ రూపొందించాలనే డిమాండ్ వినిపిస్తుంది. ఇప్పటిదాకా గల్ఫ్ వలస కార్మికుల గురించి మాట్లాడినవారు ఉన్నారు తప్ప ప్రభుత్వం నుంచి ఎలాంటి సానుకూలంగా స్పందించలేదు.

పంటలన్నీ ఇసుకపాలు..

భారీ వర్షాలతో సాగు ఆరంభంలోనే పంటలు అంతా ఇసుకపాలయ్యాయి. పరిహారంను మంజూరు చేయాలనే వినతులు వెల్లువెత్తుతున్నాయి. నిధుల కొరతతో ప్రభుత్వం సాయం అందించే పరిస్థితి కనిపించడం లేదు. శాసనసభలో చర్చ జరిపించి రైతులకు మేలు చేయాలనే వాదన వినిపిస్తుంది. రుణ మాఫీపైనా కూడా ప్రభుత్వం ఎలాంటి స్పందన లేకపోవడంతో ఈ సమావేశాలతోనైనా కొలిక్కి వస్తుందనే ఆశతో రైతులు ఉన్నారు.

క్లుప్తంగా

ఎస్సారెస్పీలోకి తగ్గిన ఇన్‌ఫ్లో



బాల్కొండ: శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు తగ్గుముఖం పట్టింది. ప్రాజెక్ట్‌లోకి 6900 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్ట్‌ నుంచి కాకతీయ కాలువ ద్వారా 3 వేల క్యూసెక్కులు, లక్ష్మి కాలువ ద్వారా 100 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 300 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 500 క్యూసెక్కులు, మిషన్‌ భగీరథ ద్వారా 152 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్‌ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(90 టీఎంసీలు) అడుగులు కాగా బుధవారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1089.9(84.29 టీసీలు) అడుగుల నీరు నిల్వ ఉంది.

బీజేపీ అధికార ప్రతినిధుల నియామకం

సుభాష్‌నగర్‌: బీజేపీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా నలుగురు జిల్లా అధికార ప్రతినిధుల తోపాటు మీడియా ఇన్‌చార్జి, మీడియా కో ఇన్‌చార్జిలను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీ నర్సయ్య బుధవారం నియమించారు. అధికార ప్రతినిధులుగా లింగంపల్లి లింగం (నిజామాబాద్‌ రూరల్‌), గంగాధర్‌ గౌడ్‌ (బాన్సువాడ), జెస్సు అనిల్‌ (ఆర్మూర్‌), రవీందర్‌ ర్యాడ (బాల్కొండ) నియమితులయ్యారు. అదేవిధంగా జిల్లా మీడియా ఇన్‌చార్జిగా కందుల జశ్వంత్‌ రావు (నిజామాబాద్‌ అర్బన్‌), కో ఇన్‌చార్జిగా సందీప్‌ను నియమించారు.

రసాయన శాస్త్ర పితామహుడు పీసీరే



తెయూ(డిచ్‌పల్లి): భారతదేశ రసాయన శాస్త్ర పితామహుడు ప్రఫుల్ల చంద్ర రే (పీసీరే) చిర స్మరణీయుడని తెయూ అధ్యాపకుడు వాసం చంద్రశేఖర్‌ అన్నారు. తెయూ ఫార్మాస్యూటికల్‌ కెమిస్ట్రీ విభాగంలో బుధవారం పీసీరే జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌ మాట్లాడుతూ.. పీసీరే భారతదేశ రసాయన శాస్త్రానికి దిక్సూచిగా నిలిచారని కొనియాడారు. డాక్టర్‌ ఎం సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ.. భారతదేశం నుంచి ఎడెన్‌బర్గ్‌ యూనివర్సిటీకి వెళ్లి అక్కడ అనేక రసాయన శాస్త్ర పరిశోధనలు నిర్వహించి ఆ ఫలాలను భారతదేశానికి అందించిన ఘనత పీసీరేకే దక్కుతుందన్నారు. ఫార్మాస్యూటికల్‌ కెమిస్ట్రీ విద్యార్థులు పోస్టర్‌ ప్రజెంటేషన్‌ ద్వారా పీసీరే పరిశోధనలు ఆధునిక రసాయన శాస్త్ర అభివృద్ధికి ఏ విధంగా ఉపయోగపడుతున్నాయనే అంశాలను వివరించారు. అకడమిక్‌ కన్సల్టెంట్లు అపర్ణ, నర్సయ్య, రమ్య రామేశ్వర్‌ రెడ్డి, గోపిరాజు, శరత్‌ పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని కాపాడిన పోలీసులు

సోన్‌: నిర్మల్‌ జిల్లా సోన్‌లోని గోదావరి నది బ్రిడ్జిపై ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తిని బుధవారం పోలీసులు కాపాడారు. ఎస్సై రవీందర్‌ కథనం ప్రకారం.. నిజామాబాద్‌ జిల్లా అందకూర్‌ గ్రామానికి చెందిన బ్యాగరి బీరయ్య కుటుంబ సమస్యలతో గోదావరి బ్రిడ్జిపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకునేందుకు వచ్చాడు. పోలీసులకు సమాచారం అందడంతో సిబ్బంది బ్రిడ్జి వద్దకు వెళ్లి ఆయనను కాపాడి ఠాణాకు తీసుకొచ్చారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

రైల్వేస్టేషన్‌కు మహర్దశ

- నిజామాబాద్‌ స్టేషన్‌ ఆధునికీకరణకు రూ.53.30 కోట్లు
- అమృత్‌ భారత్‌ పథకంలో నిధులు
- 6న వర్చువల్‌ విధానంలో శంకుస్థాపన చేయనున్న ప్రధానమంత్రి



నిజామాబాద్‌ రైల్వే స్టేషన్‌

ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ రైల్వే స్టేషన్‌లో మౌలిక సదుపాయాలను కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం అమృత్‌భారత్‌ పథకంలో భాగంగా నిధులు కేటాయించింది. దీంతో నిజామాబాద్‌ రైల్వేస్టేషన్‌ సుందరీకరణకు అడుగులు పడనున్నాయి. అమృత్‌ భారత్‌ పథకం కింద ఎంపికైన రైల్వేస్టేషన్‌లలో పనులకు ఈ నెల 6న ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌ విధానంలో శంకుస్థాపన చేయనున్నారు. దీనికి సంబంధించిన ఉత్తర్వులు ఆయా రైల్వేస్టేషన్లకు అందించినట్లు సమాచారం. శంకుస్థాపనకు కావాల్సిన ఏర్పాట్లను రైల్వే అధికారులు చేస్తున్నారు.

నిత్యం రద్దీ..

నిజామాబాద్‌ రైల్వేస్టేషన్‌కు పలు రాష్ట్రాల నుంచి ప్రయాణికుల తాకిడి పెరిగింది. నిజామాబాద్‌ వ్యవసాయరంగంతో పాటు బీడీ పరిశ్రమలలో కూడా ప్రసిద్ధి. ఇక్కడి నుంచి బీడీలు, పసుపును వివిధ రాష్ట్రాలకు తరలిస్తారు. అంతేకాకుండా వ్యాపారాలకు అనువైన ప్రాంతం కావడంతో ఇక్కడికి వివిధ రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో వస్తుంటారు. నిజామాబాద్‌కు కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలు దగ్గర ఉండటంతోపాటు బాసర పుణ్యక్షేత్రాలకు ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో రైల్వే స్టేషన్‌లో నిత్యం రద్దీ ఉంటుంది.

చేపట్టే పనులు

నిజామాబాద్‌ రైల్వేస్టేషన్‌కు అమృత్‌ భారత్‌ పథకంలో భాగంగా రూ.53.30 కోట్ల నిధులు కేటాయించారు. రైల్వేస్టేషన్‌లో రెండు ప్లాట్‌ ఫామ్‌లు ఉన్నాయి. రెండో ప్లాట్‌ ఫాం వద్దకు వెళ్లడానికి మెట్లను ఏర్పాటు చేశారు. దీనికి ఎస్కలేటర్లు పెట్టనున్నారు. దీంతో పాటు వెయిటింగ్‌ గదులను ఆధునికీకరించనున్నారు. రైల్వేస్టేషన్‌కు రెండు మార్గాలు ఉండగా ఒకే మార్గంలో వెళ్లాల్సి వస్తుంది. దీంతో ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మరో గేట్‌ను రైల్వే కాంప్లెక్స్‌ పనుల కోసం మూసివేశారు. ఈ పనులు మూడేళ్లుగా జరగడం లేదు. ఈ గేట్‌ను ఓపెన్‌ చేయనున్నట్లు తెలిసింది.

సంతోషంగా ఉంది

నిజామాబాద్‌ రైల్వేస్టేషన్‌ అభివృద్ధికి నిధులు కేటాయించడం సంతోషదాయకం. ఆధునికీకరణతోపాటు రైల్వే కనెక్టివిటీ పెంచాలి.

– గద్దం మనోహర్‌రెడ్డి, మాజీ జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యులు

విద్యాసంస్థల్లో అకడమిక్‌ వాతావరణం నెలకొల్పాలి


మాట్లాడుతున్న రిజిస్ట్రార్‌ యాదగిరి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ అనుబంధ కళాశాలలు, విద్యాసంస్థల్లో అకడమిక్‌ వాతావరణాన్ని నెలకొల్పాలని రిజిస్ట్రార్‌ ఎం యాదగిరి సూచించారు. బుధవారం తెయూ క్యాంపస్‌లో అనుబంధ కళాశాలల ప్రిన్సిపాళ్లతో నిర్వహించిన సమావేశంలో రిజిస్ట్రార్‌ మాట్లాడారు. కోవిడ్‌ కాలంలో విద్యావ్యవస్థ తీవ్రంగా దెబ్బతిందని కళాశాల యజమానులు దార్శనికతతో దాన్ని పునరుద్ధరించాలని పేర్కొన్నారు. తరగతి గది ద్వారానే విద్యార్థుల్లో విజ్ఞానంతో పాటు సామాజిక, నైతిక, ప్రజాస్వామ్య విలువలు పెంపొందించవచ్చన్నారు. ఈ విద్యా సంవత్సరంలో పూర్తిస్థాయి అర్హులైన విషయ నిపుణులను ఎంపిక చేసుకొని యూనివర్సిటీ నుంచి అనుమతి పొందాలని సూచించారు. ఆడిట్‌ సెల్‌ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ ఘంటా చంద్రశేఖర్‌ మాట్లాడుతూ.. కళాశాలల బకాయిలను సకాలంలో చెల్లించాలని అన్ని కళాశాలల్లో ల్యాబ్‌, గ్రంథాలయ సౌకర్యాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఆకస్మిక తనిఖీలు ఉంటాయని నిబంధనలు పాటించని కళాశాలలపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆడిట్‌సెల్‌ జాయింట్‌ డైరెక్టర్‌ అతిక్‌ సుల్తాన్‌ ఘోరీతో పాటు వర్సిటీ పరిధిలోని 60కి పైగా అనుబంధ కళాశాలల ప్రిన్సిపాల్స్‌ పాల్గొన్నారు.

మళ్లీ దరఖాస్తు అవసరం లేదు

మోర్తాడ్‌: మైనారిటీ కార్పొరేషన్‌ ద్వారా రూ.లక్ష సాయం కోసం నోటిఫికేషన్‌ జారీ చేసిన ప్రభుత్వం మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. గతంలో మైనారిటీ కార్పొరేషన్‌ ద్వారా రాయితీ రుణాల పంపిణీ కోసం వచ్చిన దరఖాస్తులనే పరిశీలిస్తామని ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. దీంతో రూ.లక్ష సాయం కోసం ముస్లిం మైనారిటీలు కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేకుండా పోయింది.

జిల్లాలో గతంలో 13,105 మంది దరఖాస్తులను సమర్పించారు. వీటిలో అర్హులైన వారిని గుర్తించి రూ.లక్ష సాయం అందించనున్నారు. కొత్తగా క్రిస్టియన్‌, ఇతర మైనారిటీలకే దరఖాస్తుల సమర్పణకు అవకాశం ఉంది.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపిక



నిజామాబాద్‌నాగారం: జిల్లా అథ్లెటిక్స్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు క్రీడాకారులను ఎంపిక చేశారు. నాగారంలోని రాజారాం స్టేడియంలో అండర్‌–14, 16, 20, సీనియర్‌ విభాగంలో మహిళలు, పురుషులకు పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన వారిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. జిల్లా అధ్యక్షుడు రత్నాకర్‌, కార్యదర్శి రాజాగౌడ్‌ పాల్గొన్నారు.

చెట్టెక్కి యువకుడి హల్‌చల్‌



రామారెడ్డి: రామారెడ్డికి చెందిన యువకుడు ఆత్మహత్య చేసుకుంటానని చెట్టెక్కి బెదిరింపులకు పాల్పడిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. రామారెడ్డి– కన్నాపురం రోడ్డు మార్గంలో కస్తూర్బా గాంధీ పాఠశాలకు సమీపంలో రాజశేఖర్‌ (30) అనే యువకుడు తాడు పట్టుకొని చెట్టు ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. రోడ్డు వెంట వెళ్తున్న వారు గమనించి సముదాయించే ప్రయత్నం చేసిన ఫలితం లేకపోవడంతో వెంటనే 100 ఫోన్‌ చేశారు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని రాజశేఖర్‌ను సముదాయించి కిందికి దింపారు. ఇంట్లో గొడవల కారణంగానే ఆత్మహత్య ప్రయత్నం చేసినట్లుగా స్థానికులు చెబుతున్నారు.

ధర్మారం(బి) శివారులో గుట్కా బస్తాలు



డిచ్‌పల్లి: డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి)– మెంట్రాజ్‌పల్లి రోడ్డులో వంతెన కింద గుర్తుతెలియని వ్యక్తులు 15 గుట్కా బస్తాలు పడవేశారు. బుధవారం వంతెన పక్కనే పొలాల వద్దకు వెళ్లిన రైతులు గుట్కా బస్తాలను గమనించి పోలీసులకు సమాచారం అందించారు. డిచ్‌పల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బస్తాలను, అందులోని గుట్కా ప్యాకెట్లను పరిశీలించారు. ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు ఇక్కడ గుట్కా బస్తాలను డంప్‌చేసి ఉంటారని దీనిపై తాము ఎలాంటి కేసు నమోదు చేయలేమని పోలీసులు తెలిపారు. ఫుడ్‌ ఇన్‌స్పెక్టర్‌కు మాత్రమే గుట్కాను సీజ్‌ చేసి కేసులు నమోదు చేసే అధికారం ఉంటుందన్నారు.

ఉపాధి పనులపై నిర్లక్ష్యం వహించొద్దు


మాట్లాడుతున్న డీఆర్‌డీవో చందర్‌నాయక్‌

సిరికొండ: గ్రామాల్లో ఉపాధి హామీ పనుల పట్ల నిర్లక్ష్యం వహించొద్దని డీఆర్‌డీవో చందర్‌నాయక్‌ సిబ్బందికి సూచించారు. మండల కేంద్రంతో పాటు సర్పల్లి చెరువు తండాలో గుంతలు తీసి మొక్కలు నాటే పనులను ఆయన బుధవారం పరిశీలించారు. అనంతరం మండల పరిషత్‌ కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో అంతర్గత వీధుల్లో పూలమొక్కలు, అటవీ ప్రాంతాల్లో పండ్ల మొక్కలు, అటవీ సరిహద్దు ప్రాంతంలో వెదురు మొక్కలు, చెరువు కట్టల వెంబడి ఈత మొక్కలను నాటాలని సూచించారు. ఎంపీడీవో లక్ష్మీప్రసాద్‌, ఏపీవో రాజశేఖర్‌, పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

తొలిమెట్టు లక్ష్యాన్ని సాధించాలి


మాట్లాడుతున్న రాష్ట్ర పరిశీలకుడు కిషన్‌

బోధన్‌: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న తొలిమెట్టు లక్ష్యాన్ని సాధించాలని ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమం రాష్ట్ర పరిశీలకుడు కిషన్‌ అన్నారు. విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలు పెంచేందుకు ప్రణాళికబద్ధంగా ముందుకెళ్లాలన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలోని రాకాసీపేట్‌ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డివిజన్‌ స్థాయి ఉర్దూమీడియం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు, తెలుగు మీడియం బోధన్‌, సాలూర మండలాల ఎంపీఎస్‌ ఉపాధ్యాయులకు వేర్వేరుగా శిక్షణ తరగతుల నిర్వహించారు. తరగతులు ఈ నెల 8 వరకు కొనసాగనున్నాయి. శిక్షణ కార్యక్రమాన్ని ఎంఈవో నాగ్‌నాథ్‌ ప్రారంభించారు. బీటీనగర్‌ కాంప్లెక్స్‌ స్కూల్‌ హెచ్‌ఎం వెంకట రమణగౌడ్‌, ఆర్‌పీలు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

తహసీల్దార్లకు పోస్టింగులు

సుభాష్‌నగర్‌: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మల్టీ జోన్‌–1 పరిధిలోని వివిధ జిల్లాల నుంచి బదిలీపై నిజామాబాద్‌కు వచ్చిన తహసీల్దార్లకు పోస్టింగులు ఇస్తూ కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు బుధవారం ఉత్తర్వులిచ్చారు.

23 మండలాలకు తహసీల్దార్లను అలాట్‌ చేశారు. వేరే జిల్లాల నుంచి బదిలీపై రానున్న తహసీల్దార్లు నేడో, రేపో బాధ్యతలు స్వీకరించే అవకాశముంది. కాగా అలాట్‌ అయిన తహసీల్దార్లు ఏ రోజు బాధ్యతలు తీసుకుంటారో ఆర్డీవోలకు సమాచారమివ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జిల్లా నుంచి బదిలీపై వెళ్లిన తహసీల్దార్లు వెంటనే బాధ్యతలను డిప్యూటీ తహసీల్దార్లకు అప్పగించి, రిలీవ్‌ కావాలని ఆదేశించారు.

తహసీల్దార్లకు కేటాయించిన మండలాలు..

పేరు	మండలం	పేరు	మండలం
		బి మధుసూదన్‌రెడ్డి	వర్ని
పి వెంకట్‌రమణ	భీమ్‌గల్‌	కె రవికాంత్‌	నిజామాబాద్‌ సౌత్‌
జె అనిరుధ్‌	నిజామాబాద్‌రూరల్‌	పి మునీందర్‌	నిజామాబాద్‌ నార్త్‌
ఎంఏ ఖలీం	జక్రాన్‌పల్లి	ఎండీ తఫాజుల్‌ హుస్సేన్‌	మోపాల్‌
శ్రీకాంత్‌ గుండల్‌వార్‌	ఆర్మూర్‌	ఎం నారాయణ	చందూరు
బి ప్రభాకర్‌	కోటగిరి	కె గంగాధర్‌	బోధన్‌
ఎ శ్రీధర్‌	బాల్కొండ	కె ధన్‌వాల్‌	నవీపేట్‌
డి సుజాత	కమ్మర్‌పల్లి	పి ఆనంద్‌కుమార్‌	నందిపేట్‌
ఎం రాజేందర్‌	డిచ్‌పల్లి	జె వెంకట్‌రావు	ఇందల్వాయి
బి రవీందర్‌రావు	సిరికొండ	కె మోతిసింగ్‌	ఎడపల్లి
ఎండీ యూసుఫ్‌	ఏర్గట్ల	ఎస్‌ వెంకటేశం	రుద్రూరు
ఎండీ అబ్దుల్‌ మాజిద్‌	మోర్తాడ్‌	బి మాలతి	ధర్పల్లి

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి


మాట్లాడుతున్న డీఈవో దుర్గాప్రసాద్‌

జక్రాన్‌పల్లి: తరగతి గదిలో విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని డీఈవో దుర్గాప్రసాద్‌ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో తొలిమెట్టు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాఠశాల స్థాయిలో విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని సూచించారు. ఎంఈవో శ్రీనివాస్‌, నోడల్‌ అధికారి రవీందర్‌, రిసోర్స్‌ పర్సన్లు రాములు, జీవన్‌, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి


మాట్లాడుతున్న యూనియన్‌ బ్యాంకు రీజినల్‌ మేనేజర్‌ శంకర్‌

నిజామాబాద్‌నాగారం: నగరంలోని మహిళలు రుణాలు తీసుకొని ఆర్థికంగా ఎదగాలని యూనియన్‌ బ్యాంకు రీజినల్‌ మేనేజర్‌ హెచ్‌ శంకర్‌ సూచించారు. బుధవారం నగరంలో ప్రగతినగర్‌ బ్యాంకులో మెప్మా ద్వారా మహిళల సంఘాలు, వీధి వ్యాపారుల రుణాలపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా యూనియన్‌ బ్యాంకు ద్వారా మహిళా సంఘాల సభ్యులకు రుణాలు అందిస్తామన్నారు. వీధి వ్యాపారులకు సైతం రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. మెప్మా ఇన్‌చార్జి పీడీ మాధురి, మున్సిపల్‌ టౌన్‌ ప్రాజెక్ట్‌ అధికారి రమేష్‌, పీఆర్‌పీ శోభారాణి, బ్రాంచ్‌ మేనేజర్‌ సుబ్రహ్మణ్యం, వైభవ్‌ పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌

కాలువలో పడి ఒకరి మృతి



వర్ని: వర్నిలోని నిజాంసాగర్‌ ప్రధాన కాలువలో కోటగిరి గ్రామానికి చెందిన కూచి లక్ష్మణ్‌ (59) పడి మృతి చెందినట్లు ఎస్సై కృష్ణ తెలిపారు. కోటగిరికి చెందిన లక్ష్మణ్‌ బుధవారం ఉదయం బహిర్‌ భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడి కుమారుడు సాయిబాబా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

చేపల వేటకు వెళ్లి ఒకరు..

రుద్రూర్‌: రుద్రూర్‌ మండలం చిక్కడపల్లి గ్రామానికి చెందిన మ్యాతరి వీరేశం (62) చేపల వేటకు వెళ్లి నీటిలో మునిగి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఉదయం వెళ్లిన వీరేశం సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతుకుతుండగా గ్రామ చెరువులో మృతదేహం లభ్యమైంది. చేపలు పడుతుండగా నీటిలో జారిపడి ఉంటాడని భావిస్తున్నారు. మృతుడి కుమారుడు సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నీరేశ్‌ తెలిపారు.

గుండెపోటుతో యువకుడు..

కామారెడ్డి రూరల్‌: కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామానికి చెందిన బోలిగద్ద కిషన్‌ (30) బుధవారం గుండెపోటుతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. బుధవారం తన బైక్‌పై అడ్లూర్‌ శివారులోని తన సోదరి పొలం వద్దకు వెళ్లాడు. నాటు వేస్తుండగా గుండెలో నొప్పి వస్తుందని బైక్‌ వద్ద వచ్చి కూర్చొని అక్కడే మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు.

భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్య

రుద్రూర్‌: కోటగిరికి చెందిన కొత్వాల్‌ సాయికుమార్‌(27) తన భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్సై బాల్‌సింగ్‌ తెలిపారు. సాయికుమార్‌ భార్య ఎనిమిది నెలల క్రితం పుట్టింటికి వెళ్లి తిరిగి రాలేదు. అప్పటి నుంచి మద్యానికి బానిసయ్యాడు. బుధవారం గ్రామ శివారులోని గుట్ట ప్రాంతానికి వెళ్లి ఉరి వేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ


దూదిగాంలో వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

బాల్కొండ: మెండోరా మండలం దూదిగాంలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. మెండోరా ఎస్సై శ్రీనివాస్‌ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సరికెల లక్ష్మి ఇంటికి తాళం వేసి గత సోమవారం హైదరాబాద్‌కు వెళ్లింది. బుధవారం సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చే సమయానికి తాళం పగుల గొట్టి ఉంది. ఆందోళనతో లోపలికి వెళ్లి చూడగా బీరువా తలుపులు తెరిచి ఉన్నాయి. బీరువాలోని నాలుగు తులాల బంగారం, నగదును ఎత్తుకెళ్లినట్లు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ఇంటిని పరిశీలించి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు చేశారు.

పోత్నూర్‌ బెల్ట్‌ షాప్‌లో..

సిరికొండ: మండలంలోని పోత్నూర్‌లో వినోద్‌కు చెందిన మద్యం బెల్ట్‌ దుకాణంలో మంగళవారం అర్ధరాత్రి దొంగతనం జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. దొంగలు దుకాణం తాళం పగులగొట్టి రూ.లక్ష విలువైన మద్యం సీసాలను ఎత్తుకెళ్లారు. ఎస్సై రమేశ్‌ చోరీ జరిగిన దుకాణాన్ని పరిశీలించారు.

కోడి కూర కోసం దాడి

ఖలీల్‌వాడి: చికెన్‌ వేయలేదని మేనమామను కట్టెతో కొట్టిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్‌ తెలిపారు. వివరాలు.. నగరంలోని అంబేడ్కర్‌ కాలనీకి చెందిన చింతల రాజు ఇంట్లో మంగళవారం చికెన్‌ వండారు. రాజు అక్క కుమారుడు సుమన్‌ మద్యం మత్తులో చికెన్‌ వేయాలని కోరగా ఇద్దరి మధ్య మాటలు లేనందున చికెన్‌ వేయలేమని చెప్పారు. దీంతో కోపోద్రిక్తుడైన సుమన్‌ పక్కనే ఉన్న కట్టెతో రాజు తలపై బాదాడు. బాధితుడిని జీజీహెచ్‌కు తరలించారు. రాజు భార్య గౌరవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

బోధన్‌రూరల్‌: సాలూర మండలం కుమ్మన్‌పల్లిలో పేకాట స్థావరంపై దాడి చేసి ఐదుగురిని అరెస్ట్‌ చేసినట్లు బోధన్‌ రూరల్‌ ఏఎస్సై రవీందర్‌ బుధవారం తెలిపారు. వారి నుంచి రూ.4వేలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

ఒకరిపై కేసు నమోదు

మోపాల్‌: మండల కేంద్రానికి చెందిన ఇమ్మాన్యుయేల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాము బుధవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఇమ్మాన్యుయేల్‌కు నిజామాబాద్‌కు చెందిన ఎస్తేరుకు కొన్నేళ్ల క్రితం వివాహమైంది. కుటుంబ కలహాలతో నాలుగేళ్లుగా వీరు వేర్వేరుగా ఉంటున్నారు. ఇమ్మాన్యుయేల్‌ తరచూ ఎస్తేరుతోపాటు వాళ్ల అమ్మను డబ్బులు ఇవ్వాలని వేధిస్తున్నాడు. తాజాగా మండల కేంద్రంలోని చర్చి ప్రధాన ద్వారానికి రెండ్రోజుల క్రితం కారు అడ్డుగా పెట్టాడు. కారు తీసేయాలని చెప్పినా వినిపించుకోకపోవడంతో ఎస్తేరు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

రైలు కింద పడి ఒకరి మృతి

నవీపేట: మండలంలోని ఫకీరాబాద్‌ రైల్వే స్టేషన్‌ సమీపంలో బుధవారం తెల్లవారుజామున రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే హెడ్‌ కానిస్టేబుల్‌ మహబూబ్‌ తెలిపారు. మృతుడి వయసు 45 నుంచి 50 ఏళ్ల ఉంటుందన్నారు.

ఒకరి అదృశ్యం


రామాగౌడ్‌

డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): డొంకేశ్వర్‌ మండలం దత్తాపూర్‌ గ్రామానికి వచ్చిన అబ్బగోని రామాగౌడ్‌ అదృశ్యమైనట్లు ఎస్సై రాహుల్‌ ఒక ప్రకటనలో తెలిపారు. నిర్మల్‌ జిల్లా సోన్‌ మండలానికి చెందిన రామాగౌడ్‌ (65) 15 రోజుల క్రితం తన కూతురిని చూసేందుకు డొంకేశ్వర్‌ మండలం దత్తాపూర్‌ వచ్చాడు. మూడు రోజుల పాటు అక్కడే ఉండి జూలై 19న సాయంత్రం బయటకు వెళ్లొస్తానని చెప్పి బైక్‌ను తీసుకుని వెళ్లాడు. తిరిగి రాకపోయేసరికి ఆచూకీ కోసం ఎంత వెతికినా దొరకలేదు. కూతురు రవళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నందిపేటలో మహిళ..

నందిపేట్‌: నందిపేట్‌లోని ఎన్టీఆర్‌ కాలనీకి చెందిన మిరియాల లక్ష్మి (40) అదృశ్యమైంది. ఎస్సై రాహుల్‌ తెలిపిన వివరాలు.. గత నెల 29న సాయంత్రం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. చుట్టు పక్కల గ్రామాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. ఆమె భర్త గంగాధర్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

గొర్రెల మందపై చిరుత దాడి

ఎల్లారెడ్డిరూరల్‌: గొర్రెల మందపై చిరుత దాడి చేసిన ఘటన ఎల్లారెడ్డి మండలంలోని హాజీపూర్‌ తండా అటవీ ప్రాంతంలో చోటు చేసుకుంది. తండాలోని లునావత్‌ రాంచందర్‌ మంగళవారం తన గొర్రెల మందను తీసుకుని మేతకు వెళ్లాడు. సాయంత్రం ఇంటికి వచ్చాక మూడు గొర్రెలు కనబడలేదు. దీంతో బుధవారం అటవీ ప్రాంతంలో గాలించగా ఒక గొర్రె చనిపోయి కనిపించింది. చిరుత దాడిలో గొర్రె చనిపోయినట్లు గుర్తించాడు. అటవీశాఖ అధికారులు పరిహారం అందించాలని బాధితుడు కోరాడు. చిరుత సంచారంతో తండా వాసులు ఆందోళన చెందుతున్నారు.